ప్రజా విశ్వంభర V3 NEWS

ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు

వందల మంది చేసి త్యాగాలు చేసి తెలంగాణ సాధిస్తే ఆ త్యాగాన్ని బీఆర్ఎస్ వాళ్లు తమ ఖాతాలో వేసుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. పెట్రోల్ పోసుకుని అగ్గిపెట్టె తెచ్చుకోని వాళ్లు త్యాగాలు చేసినట్లు చెప్పుకున్నారని, పెట్రోల్ పోసుకుని ప్రాణార్పణం చేసిన శ్రీకాంత్‌చారి త్యాగాన్ని ఏమనాలని, ఏ పదవులు ఆశించకుండా ప్రాణాలు అర్పించిన వారివి త్యాగాలు కావా? అని ప్రశ్నించారు.నల్గొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నల్గొండ కార్పొరేషన్‌లో తొలిదశ తాగునీటి ప్రాజెక్టు పనులకు, రూ.83 కోట్లతో తొలిదశ తాగునీటి శుద్ధికేంద్రం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నాగార్జున డిగ్రీ కాలేజీలో ఏర్పాటుచేసిన సభలో సీఎం మాట్లాడారు. అంతకుముందు నల్గొండ జిల్లా నుంచే హ్యామ్ రోడ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. కనగల్‌లో హ్యామ్‌రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు.

విశ్వంభర, నల్లగొండ బ్యూరో:

పదేళ్లు పదవులు అనుభవించి రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంతోమంది త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధిస్తే.. పదవులు మాత్రం కేసీఆర్ కుటుంబం అనుభవించిందని విమర్శించారు. ఆ కుటుంబానికి మళ్లీ అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. నల్గొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నాగార్జున కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు.

బీఆర్ఎస్ హయాంలో పేదల ఇళ్ల గురించి ఆలోచించలేదు..

''గ్రామగ్రామాన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తుంటే బీఆర్ఎస్ వాళ్లకు కడుపు మండుతోంది. పదేళ్లపాటు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు కానీ.. పేదల ఇళ్ల గురించి ఆలోచించలేదు. ఏటా రూ.16వేల కోట్లు ఖర్చు చేసి పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం. 30 నెలల్లోనే రైతుల ఖాతాల్లో రూ.1.56లక్షల కోట్లు జమ చేశాం. యూరియా సరఫరాలో కేంద్రం సహకరించకపోయినా కష్టపడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ ఇవాళ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నాం. 30 నెలల్లోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి చరిత్ర సృష్టించాం. దేశంలో గతంలో ఎన్నడూ జరగని కులగణనను రాష్ట్రంలో చేపట్టాం. మా ఒత్తిడితోనే కేంద్రం కూడా జనగణనతో కులగణన చేస్తామని చెప్పింది.

మంత్రి పదవిని త్యాగం చేసిన వ్యక్తి కోమటిరెడ్డి

తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలిసిన అందరికీ నల్గొండ చరిత్ర తెలుసు. తొలిదశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ మంత్రి పదవిని త్యాగం చేశారు. మలిదశ ఉద్యమంలో మంత్రి పదవిని త్యాగం చేసిన వ్యక్తి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. నల్గొండ జిల్లా ప్రజలు గర్వించేలా ఆయన దీక్ష కూడా చేశారు. వందల మంది త్యాగాలు చేసి తెలంగాణ సాధిస్తే దాన్ని బీఆర్ఎస్ నేతలు వాళ్ల ఖాతాలో వేసుకున్నారు. పెట్రోల్ పోసుకుని అగ్గిపెట్టె తెచ్చుకోని వాళ్లు త్యాగాలు చేసినట్లు చెప్పుకొంటున్నారు. పెట్రోల్ పోసుకుని ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి త్యాగాన్ని ఏమనాలి?

ఎవరు అడ్డువచ్చినా మూసీ ప్రక్షాళన ఆగదు..

మూసీ కాలుష్యం తమ పాలిట విషంగా మారిందని నల్గొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారు. మూసీ నదిని శుద్ధి చేసి ప్రజలకు మేలు చేస్తామంటే దాన్ని కూడా పలువురు నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఎవరు అడ్డు వచ్చినా మూసీ ప్రక్షాళన ఆగదు. ఫాంహౌస్‌లో మెషిన్లు పెట్టుకుని భార్యాభర్తల ఫోన్లు కూడా దొంగచాటుగా విన్నారు. నిజాలు మాట్లాడే అలవాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఏనాడూ లేదు. ఆ పాపాల భైరవుడు మళ్లీ అధికారంలోకి రావాలని ఇద్దరు నేతలు తిరుగుతున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చ పెడతాం. దానికి సిద్ధమా? నిజాలు మాట్లాడే అలవాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఏనాడు లేదు. ఉద్యమ సమయంలో యువకుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్నారు. తెలంగాణ వచ్చాక పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు.రూ.లక్ష కోట్లతో కేసీఆర్, హరీశ్‌రావు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలి మూలన పడింది. వైఎస్ఆర్ చేపట్టిన ఎస్ఎల్‌బీసీని పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదు. వచ్చే ఎన్నికల్లోపు ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం'' అని రేవంత్‌రెడ్డి అన్నారు. 2024 నుంచి 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనే ఉంటుందని జోస్యం చెప్పారు. పదేళ్లు పాలించి రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుపుతామని వెల్లడించారు.

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు..

చమురుతో పనామా జెండాతో వెళుతున్న ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి
ప్రతిదాడికి దిగడంతో ఒక్కసారిగా ఉద్రిక్తంగా పరిస్థితి
మళ్లీ రంగంలోకి దిగిన పాకిస్థాన్

విశ్వంభర, నేషనల్ బ్యూరో:

పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. గత రెండు రోజుల నుంచి పరిస్థితులు మళ్లీ మొదటికే వస్తున్నాయి. చమురుతో పనామా జెండాతో వెళుతున్న ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేసినట్లు ఆరోపించిన అమెరికా బలగాలు.. ప్రతిదాడికి దిగడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ఇరాన్ కూడా దాడులు ఆపకపోవడంతో.. బదులుగా హర్మూజ్ జలసంధి సమీపంలోని టెహ్రాన్ లక్ష్యాలపై యూఎస్ బలగాలు బాంబులు పేల్చాయి. ఈ తరుణంలో ఇరాన్ అమెరికా మధ్య శాంతి ఒప్పందం కుదర్చడంలో కీలకంగా వ్యవహరించిన పాకిస్థాన్ మళ్లీ రంగంలోకి దిగింది.పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిస్థితులపై పాకిస్థాన్ డిప్యూటీ ప్రధాని ఇషాక్ దార్, బహ్రెయిన్ విదేశాంగశాఖ మంత్రి రషీద్ అల్ జయాని ఫోన్‌లో మాట్లాడుకున్నారు. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించినట్లు పాకిస్థాన్ విదేశాంగశాఖ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన పెంపొందించడంలో పాక్ నిర్మాణాత్మక పాత్రను అల్ జయానీ అభినందించినట్లు పేర్కొంది. మరోవైపు అమెరికా, ఇరాన్ ప్రతినిధులతో ఇషాక్ దార్ మాట్లాడినట్లు సమాచారం. ఉద్రిక్తతలకు తావివ్వకుండా ఎంవోయూకు కట్టుబడి ఉండాలని చెప్పినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగుతున్న నేపథ్యంలో గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్‌లు బిక్కుబిక్కుమంటున్నాయి. గతంలో ఈ రెండు దేశాలపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. భారీ స్థాయిలో, ప్రాణ, ఆస్తినష్టం జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. తాజాగా మరోసారి ఇరాన్ దాడులకు తెగబడుతుందన్న ఉద్దేశంలో ముందస్తుగానే మధ్యవర్తిగా ఉన్న పాక్‌ను సాయం కోరినట్లు తెలుస్తోంది. మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు. ఈసారి ఆ దేశపు ఉనికే ప్రమాదంలో పడుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్ కొత్తపేరు హెచ్ఆర్ఎస్

నిన్న టీఆర్ఎస్, ఇవాళ బీఆర్ఎస్, రేపు హరీశ్ రావు రాష్ట్ర సమితి
పూటకో సారి పార్టీ పేరు మార్చుకునే మీరు మా గురించి మాట్లాడుతారా?
రాష్ట్రంలో కేటీఆర్, హరీశ్ రావులకు ఎలాంటి పని లేదు
ఏం మంచి పని చేయాలని తలపెట్టినా కాళ్లల్లో కట్టె పెట్టే ప్రయత్నం చేస్తున్నారు
పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ పేద ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వలేదు
మేము అధికారంలోకి వచ్చాక పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో:

బీఆర్ఎస్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. హ్యామ్ రోడ్లకు టెండర్లు పిలవకముందే అవినీతి అంటూ హరీశ్ రావు, కేటీఆర్ మాట్లాడుతున్నారని పూటకో పేరు మార్చుకునే పార్టీ కాంగ్రెస్ ను విమర్శిస్తోందని దుయ్యబట్టారు. నిన్న టీఆర్ఎస్, ఇవాళ బీఆర్ఎస్, రేపు హెచ్ఆర్ఎస్(హరీశ్ రావు రాష్ట్ర సమితి) అవుతుందని కానీ కాంగ్రెస్ అంటే శాశ్వతం అని సెటైర్ వేశారు. ఆదివారం నల్గొండ జిల్లాలో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభలో మాట్లాడిన మంత్రి కేసీఆర్ పదేళ్లపాటు నల్గొండ జిల్లాకు మోసం చేశారని, కుర్చీ వేసుకుని కూర్చుని మన ప్రాజక్టులు పూర్తి చేస్తామని విస్మరించారన్నారు.రాష్ట్రంలో కేటీఆర్, హరీశ్ రావులకు ఎలాంటి పని లేదని అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఏం మంచి పని చేయాలని తలపెట్టినా కాళ్లల్లో కట్టె పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పచ్చ కామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు కాళేశ్వరం, ధరణి పేరుతో దోచుకున్న వాళ్లకు మిగతా వాళ్లు కూడా అలాగే దోచుకుంటారని అనుకుంటున్నారని విమర్శించారు. పూటకో సారి పార్టీ పేరు మార్చుకునే మీరు మా గురించి మాట్లాడుతారా అని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ పై ఈ దొంగల కన్ను పడిందని, ఇది పూర్తయితే కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందని నల్గొండ ప్రజలకు మేలు జరుగుతుందనే ఓర్వలేకపోతున్నారన్నారు. నల్గొండ ప్రజలు అడగకముందే సీఎం రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళనకు పూనుకున్నారని ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని చూస్తున్న కిషన్ రెడ్డి ఓ సారి మూసీ ఒడ్డున పడుకోవాలన్నారు.పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ పేద ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారులకు పశువులు తినే నాసిరకమైన బియ్యం ఇచ్చారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. కానీ మేము అధికారంలోకి వచ్చాక పేదలకు సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమంలో ఇందిరమ్మ ప్రభుత్వం దూసుకుపోతోందని చెప్పారు. గతంలో ఇందిరమ్మ, వైఎస్సార్ హయంలోనే అత్యధికంగా ఇండ్లు ఇస్తే ఇప్పుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే మళ్లీ ఊరూరా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. కేసీఆర్ హయంలో రాష్ట్రంలో రోడ్లను మరమ్మతులు చేయని పరిస్థితి ఉండేదని కానీ ఇవాళ రూ.13,006.27 కోట్లు అంచనా వ్యయంతో హ్యామ్ రోడ్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు.

తెలంగాణ అభివృద్ధి డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే సాధ్యం

తెలంగాణ ప్రజలకు బీజేపీపై నమ్మకముంది
ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు
తెలంగాణ ఏర్పాటుకు బీజేపీ కూడా పోరాడింది
బీఆర్ఎస్ అధికారంలో ఉండగా పెద్ద ఎత్తున అవినీతి జరిగింది
ఆ పార్టీపై వ్యతిరేకతతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదు.
బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నితిన్ నబీన్

విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు బీజేపీపై నమ్మకముందని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. ఆ నమ్మకాన్ని పార్టీ బూత్ అధ్యక్షులు ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బీజేపీ బూత్ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ''సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ సహకారంతో భాగ్యనగరానికి విముక్తి కలిగింది. తెలంగాణ ఏర్పాటుకు బీజేపీ కూడా పోరాడింది. పార్లమెంట్‌లో సుష్మాస్వరాజ్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం గళమెత్తారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా పెద్ద ఎత్తున అవినీతి జరిగింది. ఆ పార్టీపై వ్యతిరేకతతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదు. ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తోంది. తెలంగాణ అభివృద్ధి డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే సాధ్యం. కాంగ్రెస్‌ది భారతీయ ఆలోచన కాదు.. ఇటలీ ఆలోచన. 2028లో తెలంగాణలో భాజపా ప్రభుత్వం ఏర్పడుతుంది. నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సాహసోపేతమైన నిర్ణయాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాలి. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి సమన్వయంతో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పనిచేయాలి'' అని నితిన్ నబీన్ దిశానిర్దేశం చేశారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: రామచందర్‌రావు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కలిసినా హైదరాబాద్ భాజపా అడ్డా అన్నారు. రానున్న ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లనూ కైవసం చేసుకుంటామని చెప్పారు. నగరంలో చిన్నపాటి వర్షాలకే రోడ్లు నదులను తలపిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. రోహింగ్యాలు, బంగ్లాదేశీయుల ఓట్లతో కార్పొరేషన్లు దక్కించుకోవాలని మజ్లిస్ కుట్ర పన్నుతోందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడం లేదు

విశ్వంభర, వికారాబాద్ ప్రతినిధి:

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతులను పేద బడుగు బలహీన వర్గాలను మోసం చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడం లేదని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గౌలి కార్ ఫంక్షన్ హాల్ లో జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అధ్యక్షతన నాయకుల కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో సీఎం రేవంత్ రెడ్డి ఆయన సోదరులు భూములు లాక్కుంటున్నారని రైతులు కన్నీరు పెడితే పుట్టగతులు ఉండవని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్నదమ్ములు భూములు లాక్కుంటున్నారు. వికారాబాద్ కు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఏంచేశారో చెప్పాలి అని పేర్కొన్నారు. అసత్యపు ఆరోపణలు చేస్తూ గత ప్రభుత్వం అప్పులు చేసిందని మేము వాటిని వడ్డీలు కడుతున్నామని స్పీకర్ హోదాలో ఉండి ఇలా మాట్లాడడం సరైనది కాదన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్ అప్పులు చేసిన జిల్లాలు ఏర్పాటు చేసి జిల్లా కార్యాలయాలతో పాటు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసి వాటి నిర్మాణాలు చేసి అభివృద్ధి చేశారన్నారు. ప్రాజెక్టులు చేపట్టి రైతన్నలకు సాగునీరు అందించిన భగీరథుడు కేసీఆర్ అన్నారు. పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి బాటలు వేశారన్నారు.రైతులకు రైతుబంధు తో పాటు ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచి రైతు కష్టాలు తీర్చిన మహనీయుడు కేసీఆర్ అన్నారు. ఇలాంటివి చూడకుండా రాజ్యాంగ బద్ధ పదవిలో ఉండి అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. అసత్యపు ప్రచారాలు చేస్తూ నాయకులపై కార్యకర్తలపై కేసులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు పోలీసులు ఇష్టానుసారంగా అధికార పార్టీకి కొమ్ముకాసి టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయవద్దని అన్నారు. 12 లక్షల చెట్లు నరికి దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేయడం దుర్మార్గం అని అన్నారు. 2028 లో మళ్లీ తెలంగాణ లో బిఆర్ఎస్ అధికారంలో రావడం పక్కా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ కా ఖేల్ ఖతం దుకాన్ బంద్ చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు రైతుబంధు అవసరానికి యూరియా ఎరువులు ఈయ్యాక పోతే మీరు ఎందుకు ఉన్నారు అని ప్రశ్నించారు. కెసిఆర్ అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేశారూ పేదల పెళ్లిళ్లకు పెద్దదిక్కుల కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలు ఇచ్చారన్నారు. పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసాగా సీఎం రిలీఫ్ ఫండ్ అమలు చేసి పేదల ఆరోగ్యానికి అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్ వి 13 డిక్లరేషన్లు ఎక్కడున్నాయో చెప్పాలి అని అన్నారు. ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు ఆడపడుచులకు నెలకు 2500 ఇస్తానని ఇప్పటికీ అమలు చేయలేదని ఇలా చెప్పుకుంటూ పోతే 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఫెయిల్ అయిపోయిందన్నారు. వికారాబాద్ ప్రజల ఆకాంక్షను నెరవేర్చింది కేసీఆర్ కాదా వికారాబాద్ కు మెడికల్ కళాశాల కలెక్టరేట్ ను మంజూరు చేశాము ఇలా చెప్పుకుంటూ పోతే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. పట్టణానికి ప్రధానంగా ఉన్నటువంటి సమస్య రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి 96 కోట్లు మంజూరు చేసి అభివృద్ధికి బాటలు వేయడం జరిగిందన్నారు.

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు..

విశ్వంభర, జూబ్లీహిల్స్:

అనంతరం మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. గత 14 సంవత్సరాలుగా తెలంగాణలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని, దీనికి తల్లిదండ్రుల్లో పెరిగిన అవగాహన, ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి ప్రధాన కారణమని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 52 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని చెప్పారు. జూన్ 28, 29, 30 తేదీల్లో ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మంత్రి కోరారు. మన పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని, పోలియో నిర్మూలన కోసం ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేసి, ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా ముందస్తు జాగ్రత్తగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో రహిత తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి ఇంటికీ పోలియో చుక్కలు అందేలా ఆరోగ్య శాఖ విస్తృత చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఆరోగ్య శాఖ కమిషనర్ డా. ఎస్. సంగీత సత్యనారాయణ, డా. నాగలక్ష్మి (మెడికల్ ఆఫీసర్), డా. విజయ్ నిర్మల (జాయింట్ డైరెక్టర్ - చైల్డ్ హెల్త్ & ఇమ్యూనైజేషన్), డా. పుట్ల శ్రీనివాస్ (డీఎంహెచ్‌వో), డా. సంధ్య (డిప్యూటీ డీఎంహెచ్‌వో), డా. పెటర్సన్, డా. జ్యోత్స్నా, డా. డేవిడ్, డా. మురారి, డా. శ్రీనాథ్, డా. శ్రీధర్, ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ, ఏపీ విభజనపై వెంకయ్యనాయుడు సంచలన వ్యాఖ్యలు

విశ్వంభర, విజయవాడ: ఏపీ, తెలంగాణ విభజనపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను విద్యార్థిగా ఉన్న సమయంలోనే అనేక ఉద్యమాలు జరిగాయన్నారు. ముఖ్యమంత్రి చెన్నారెడ్డిని దింపాలని, ఆ తరవాత నరసింహారావును దింపేయాలని మరో ఉద్యమం జరిగిందన్నారు. ఏది ఏమైనా ఆనాడే రెండు రాష్ట్రల విభజన జరిగి ఉంటే ఇంకా అభివృద్ధి చెందేవని చెప్పారు. ఏపీ మరింత అభివృద్ధి చెందేదని అన్నారు. బీజేపీ కూడా ఒక ఓటు రెండు రాష్ట్రాలు అని పిలుపునిచ్చిందని చెప్పారు. వెంకయ్యనాయుడు ఏదో ఒకరకంగా అడ్డుకట్ట వేస్తారని అప్పుడు అనుకున్నారని, కానీ సోనియాగాంధీ తనను అడిగినప్పుడు విభజనకు ఓకే చెప్పానని తెలిపారు. సోనియా గాంధీ వచ్చి మీరు సీరియస్ గానే చెబుతున్నారా? అని అడగ్గా అవుననే సమాధానం ఇచ్చానని అన్నారు. ఆ తరవాత దిగ్విజయ్ సింగ్, మురళీదేవర తనవద్దకు వచ్చి బీజేపీ తెలంగాణకు అనుకూలమేనా? మీరు ఏదో ఒక రకంగా అడ్డుకట్ట వేస్తారని అంతా అనుకుంటున్నారని చెప్పారన్నారు. తాను పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసే వ్యక్తినని రెండు రాష్ట్రాలు ఏర్పడాలనేదానికి తాను వ్యతిరేకం కాదని చెప్పినట్టు తెలిపారు. కానీ ఆంధ్ర ప్రదేశ్‌కు తగిన న్యాయం జరగాలని దాని కోసం పోరాడతానని చెప్పినట్టు వెల్లడించారు. ఆరోజు రాత్రి 2గంటల వరకు వాదోపవాదనలు జరిగాయన్నారు. తాను ఏపీకి తగిన న్యాయంకోసం ప్రభుత్వంతో గట్టిగా వాదించానని అన్నారు. దిగ్విజయ్ సింగ్, మురళీదేవర తనతో సుమారు మూడు నాలుగు రోజులు సంప్రదింపులు జరిపారిన చెప్పారు. ఒకవేళ మీరు విభజనను వ్యతిరేకిస్తే మీ మీద సాకుతో మేం కూడా విభజనను వ్యతిరేకించాలని అనుకుంటున్నాం అని తనతో చెప్పారన్నారు. కానీ తాను తెలంగాణ ఏర్పాటుకు సమర్థిస్తాననే చెప్పానని తెలిపారు. ఆ తరవాత ఏపీకి ఏ రాష్ట్రానికి లభించని నిధులు, ప్రాజెక్టులు వచ్చాయని అన్నారు. ఏదో ఒక సంస్థ వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చానని తెలిపారు.

ప్రధాని మోడీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' అవార్డును అందజేసిన ఆ దేశ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ
ప్రపంచ దేశాలకు నాయకత్వం వహిస్తున్నందుకుగానూ ఈ పురస్కారం ప్రదానం
ఈ అవార్డును అత్యంత గౌరవంగా స్వీకరిస్తున్నా
పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తున్న భారత ప్రజలందరికీ ఈ అవార్డును అంకితం
అందరూ ఏకమై పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాల్సిన అవసరం ఉంది: ప్రధాని మోడీ

విశ్వంభర, నేషనల్ బ్యూరో:

ప్రధాని మోడీకి మరో అరుదైన గౌరవ పురస్కారం లభించింది. సీషెల్స్ దేశ అత్యున్నత 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ ఆయనకు అవార్డు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, సుస్థిర అభివృద్ధి సాధించడంలో ప్రపంచ దేశాలకు నాయకత్వం వహిస్తున్నందుకుగానూ సీషెల్స్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది.దీనిపై ప్రధాని మోడీ స్పందిస్తూ సీషెల్స్ దేశ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తున్న భారత ప్రజలందరికీ ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ''ఈ అవార్డును అత్యంత గౌరవంగా స్వీకరిస్తున్నా. వాతావరణ మార్పులతో సతమతమవుతూ, పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న అన్ని దేశాల ప్రజలకు ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నా. అందరూ ఏకమై పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాల్సిన అవసరం ఉంది. మన గ్రహాన్ని మరింత పచ్చగా, సుస్థిరంగా మార్చేందుకు భారత్ సిద్ధంగా ఉంది. కానీ, అందుకు అన్ని దేశాలూ ముందుకు రావాలి. అప్పుడే అది సాధ్యపడుతుంది'' అని మోడీపేర్కొన్నారు. వాతావరణ పరిరక్షణ అంశంలో ప్రధాని మోడీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఇదే తొలిసారి కాదు. ఆహార భద్రత, వ్యవసాయంలో తీసుకొస్తున్న మార్పులు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాల్లో ఆయన చేసిన కృషికి గానూ మే 2026లో ప్రపంచ వ్యవసాయ, ఆహార సంస్థ (ఎఫ్ఏఓ) ఆయనకు 'అగ్రికోలా మెడల్'ను బహూకరించింది. 2018లో సుస్థిర ఆర్థికాభివృద్ధి, ప్రపంచ సహకారం, సమ్మిళిత అభివృద్ధి రంగాల్లో ఆయన సేవలకుగానూ సియోల్ శాంతి బహుమతి వరించింది. అదే ఏడాది ఐక్యరాజ్యసమితి.. 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్' అవార్డుతో సత్కరించింది.

రైతులకు భరోసా ఇస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీది

కారు కూతలు కూస్తున్న దొరల మాటలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదు.. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తాం. మంత్రి పొంగులేటి

విశ్వంభర, ఖమ్మం: ఖమ్మం వేదికగా రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్‌దైతే అదే ఖమ్మంలో రైతులకు భరోసా ఇస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కారు కూతలు కూస్తున్న దొరల మాటలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిసే వారి మనుసులో ఉన్న విషాన్ని కక్కుతున్నారన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన మంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు ఎన్నో కొత్త పథకాలు ఇచ్చామని కోటీ మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామన్నారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీకే రుణాలు ఇస్తున్నామన్నారు. రైతులు వర్షాధార పంటలు సాగు చేయాలన్నారు. రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు రైతుల కోసం మొసలి కన్నీరు కారుస్తూ ప్రభుత్వంపై విమర్శచేసే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎన్ని విమర్శలు చేసినా తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తూనే ఉన్నారని చెప్పారు. ఈనెల 30న జరిగే రైతుఆశీర్వాద సభకు హాజరుకాబోతున్న రైతులు, మహిళల సంఖ్యను చూసి బీఆర్ఎస్ నేతల గుండెలు పగిలిపోతాయన్నారు.